క్లుప్తంగా

ముత్యాలమ్మ తల్లికి బోనం



బోనాలతో వెళ్తున్న మహిళలు

సుజాతనగర్: నాయకులగూడెం గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి ఆదివారం స్థానికులు ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామంలో నాభిశిల ఏర్పాటు చేసి ఏడాది కావడంతో బోనాల కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పువాయిద్యాల చప్పుళ్ల మధ్య మహిళలు, యువతులు ఇంటికో బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

విరాళం



పుల్లయ్యకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన సూర్యదేవర పుల్లయ్య, నాగవెంకటలక్ష్మి రూ.25,116, కొత్తగూడెంలోని కూలీలైన్‌కు చెందిన పిల్లిరోహిత్ చంద్ర రూ.5116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన జాతర



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పడమటనర్సాపురం గ్రామంలో ఈనెల 8న ప్రారంభమైన శ్రీపెద్దమ్మతల్లి జాతర ఆదివారం ముగిసింది. ఆదివాసీ నాయకపోడుల కులదైవమైన శ్రీపెద్దమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం శ్రీపెద్దమ్మతల్లి, పెద్దిరాజుల కల్యాణాన్ని పూజారులు ఘనంగా నిర్వహించారు. శ్రీపెద్దమతల్లి అమ్మవారి పీఠానికి ఎదురుగా ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో ఆదివాసీ నాయకపోడు పూజారులతోపాటు, భక్తులు ఉత్సవ మూర్తులను ఎత్తుకొని నడిచి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పసల బుచ్చయ్య, నాగరాజు, పూజారి గణపకృష్ణ, కులపెద్దలు పాల్గొన్నారు.

శ్రీ సమ్మక్క, సారలమ్మల విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న భక్తులు

పాల్వంచరూరల్: తోగ్గూడెంతండాలో ఆదివారం శ్రీసమ్మక్క, సారలమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు స్థానికులతో పాటు టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, నూకల రంగారావు, పైడిపల్లి మనోహరరావు, రామ్మూర్తి, లాల్‌సింగ్, రాములు, దేవుడమ్మ, చంద్రకళ, రమాదేవి పాల్గొన్నారు.

ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: కిన్నెరసాని నుంచి ప్రతిరోజూ పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన మహిళా కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో రోజుల తరబడి కిన్నెరసాని తాగునీరు రాక తాగేందుకు మంచినీరు కోసం ప్రజలు అల్లాడుతుంటే ఎమ్మెల్యే, అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని, పాలకుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కిన్నెరసాని మంచినీటి సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి రూ.130 కోట్ల నిధులు మంజూరు అవుతున్నాయని ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ రూపాయి కూడా మంజూరు కాలేదన్నారు. కిన్నెరసాని రెండో లైన్ పనుల్లో జరుగుతున్న జాప్యంపై కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.

‘ఉపాధి’లో మౌలిక సౌకర్యాల లేమి

- పనుల వద్ద నీడ కరువు
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు
- ఇబ్బంది పడుతున్న కూలీలు



కాల్వ పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

సుజాతనగర్: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఉపాధి’కి హామీ దక్కడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. వేతనాల కోసం కూలీలు వారాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పనులు చేసే సమయంలో కూలీలకు ఏదైనా దెబ్బ తగిలితే అక్కడే వారికి ప్రథమచికిత్స అందించాలి. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలి. కానీ ఈ సౌకర్యాలేవీ కల్పించడం లేదు. పనుల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిరోజూ ఉపాధి పనిలో రెండువేల మంది...

పల్లెల్లోని నిరుపేద కూలీలకు ఉపాధికి భరోసా కల్పించేందుకు కేంద్రప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిద్వారా నిరుపేద కుటుంబాలకు ఏడాదిలో వంద రోజులపాటు పని కల్పించాలనేది ఈ పథకం ప్రధాన లక్ష్యం. మండలంలో 9,955 జాబ్ కార్డులు ఉండగా.. సగటున ప్రతిరోజూ సుమారు రెండువేల మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. గతంలో రోజు కూలి రూ.255 ఉండగా ప్రస్తుతం రూ.272 పెంచారు. పెరిగిన వేతనం అమలవుతున్నా... కూలీలకు సకాలంలో వేతనాలు రావడం లేదు.

కనీస సౌకర్యాలు కరువు...

ఉపాధి పనులు జరుగుతున్న చోట కూలీలకు ఎండనుంచి ఉపశమనం కల్పించేందుకు నీడ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా టెంట్లు ఏర్పాటు చేయడం లేదు. మండుటెండలో కూలీలు పనులు చేస్తున్నారు. దీంతో కూలీల పిల్లలు, కూలీలు సేదతీరేందుకు అవస్థలు పడుతున్నారు.

అందుబాటులో లేని మెడికల్ కిట్లు...

పనిప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు వీలుగా మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ల్యాండ్ లెవలింగ్, చెరువులు, చెక్‌డ్యాముల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. పనుల వద్ద అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కానీ కనీసం పనుల వద్ద మెడికల్ కిట్లను కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

తాగునీరూ కరువే...

పని ప్రదేశంలో నీడతో పాటు తాగునీరు కూడా అందించాల్సిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేయడం లేదు. పని ప్రదేశంలో ప్రత్యేకంగా ఓ కూలీని నియమించి తాగునీరు అందించాలి. కానీ కూలీలే ఇళ్ల నుంచి బాటిళ్లలో మంచినీరు తెచ్చుకుంటున్నారు. నీరు తెచ్చుకున్నందుకు రూ.5 ఇస్తామని ఉపాధి సిబ్బంది కూలీలకు చెబుతున్నారు. కూలీలకు పనిముట్లను కూడా ప్రభుత్వమే సరఫరా చేయాల్సి ఉండగా అవి కూడా ఇవ్వడం లేదు. గతంలో ఎప్పుడో ఇచ్చిన పనిముట్లతోనే పనులు చేస్తున్నారు.

సకాలంలో అందని కూలి డబ్బులు..

పనిచేసిన కూలీ డబ్బులు సకాలంలో రావడం లేదు. పనిచేసిన వారం రోజుల్లోగా వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ నాలుగైదు వారాలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి భత్యం ఇవ్వాలి



తీవ్రమైన ఎండలు ఉండటంతో ఉక్కపోతతో పని చేయలేకపోతున్నాం. ప్రతి ఏడాది వేసవి భత్యం ఇచ్చినట్లుగానే ఈ ఏడాది కూడా వేసవి భత్యం ఇవ్వడంతో పాటు, పనుల వద్ద వసతులు కల్పించాలి. – బేబమ్మ, ఉపాధి కూలీ

ఆటో చార్జీలు ఇవ్వండి



దూరం నుంచి ఆటోల్లో పనులకు వస్తున్నాం. ఆటో చార్జీలకే ఒక్కొక్కరికీ రూ.50 అవుతోంది. రవాణా చార్జీలు ఇవ్వాలి. పనులు జరిగే చోట టెంట్లు వేసి నీడ ఏర్పాటు చేయాలి. ఎండతో ఇబ్బంది పడుతున్నాం. – ఆదెమ్మ, ఉపాధి కూలీ

మెడికల్ కిట్లు రాలేదు



ప్రభుత్వం నుంచి మెడికల్ కిట్లు, పలుగు, పార పనిముట్లు కూడా రాలేదు. కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు పనిచేసిన వారం లోగా చెల్లిస్తున్నాం. పేదలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి. – టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్

సీపీఎస్‌ను రద్దు చేసే వరకూ పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసే వరకు తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం జరుగుతుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో దాదాపు 500 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాత బస్‌డిపో నుంచి పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సాధారణ ఎలక్షన్స్ లోపు తెలంగాణలో సీపీఎస్‌ను రద్దు చేయాలని, లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. దశాబ్ద కాలంగా విన్నపాలకే పరిమితమైన సీపీఎస్ రద్దు అంశాన్ని.. పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగి హక్కు... అని నినదించి 2016 నుంచి యూనియన్ ఆధ్వర్యంలో పోరుబాట పట్టి పోరాట బావుటా ఎగురవేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, రవి, కిశోర్ సింగ్, కృష్ణ, రామారావు, రామ్‌కుమార్, జయబాబు, శంకర్, బిజ్జా శ్రీనివాస్, రాజు, హరిలాల్, రమేష్, రామగోపి, సురేష్, రాజశేఖర్, శ్రీనివాస్, నాగునాయక్, పూర్ణ, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న శాంతిరాం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని 1969 ఉద్యమకారులు శాంతిరామ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ్ కాలేజీ అనే పేరుతో కళాశాల స్థలాన్ని రక్షించాలని కోరారు. 1973లో ఆనాడు కళాశాలకు ప్రభుత్వం ఇచ్చిన 33 ఎకరాల స్థలం ఆక్రమణకు గురయిందని వివరించారు. అప్పట్లో కళాశాలలో ప్రతి ఏడాది ఆరువేల మంది విద్యార్థులు ఉండేవారని, ప్రస్తుతం 400 మంది చదువుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరిగోపాల్, వెంకటేశ్వర్లు, కేశవులు, రామారావు, గెర్షోము పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందు: దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఏరియా జీఎం షాలేము రాజు అన్నారు. ఆదివారం ఇల్లెందులో మాట్లాడుతూ.. కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోందని, ఈ తరుణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న ఉద్యోగులకు వ్యాప్తి చెందకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రద్దీ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

నిత్యావసరాలు అందించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: రేషన్‌షాపుల ద్వారానే 12 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఆదివారం కొమరారంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్లకు రాయితీలు ప్రకటిస్తున్న ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపుతూ ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. సబ్సిడీపై వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని కోరారు. దీనికోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి గ్రామాలలో పర్యటిస్తూ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో సమ్మక్క, నాగమ్మ, రాణి, స్వరూప, కౌసల్య, నరసమ్మ, శాంతమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయండి

పాల్వంచ: ఈనెల 18న పాల్వంచ అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించే ప్రజాపోరు యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

బీజేపీ హటావో.. దేశ్‌కో బచావో.. అనే నినాదంతో జిల్లా సమగ్ర అభివృద్ధికై సీపీఐ ఆధ్వర్యంలో 14వ తేదీ నుంచి జిల్లాలో ప్రజాపోరు యాత్రను చేపట్టడం జరిగిందన్నారు. ఈ యాత్ర మంగళవారం పాల్వంచకు చేరుకుంటుందని కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, శనగారపు శ్రీనివాస్, నరహరి నాగేశ్వరరావు, జ్యోతుల రమేష్, బాబు, కోడి నాగేశ్వరరావు, జకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంకు మోక్షమెన్నడో?



కొత్తగూడెం బస్టాండ్‌లో ఏటీఎం దుస్థితి

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ఏటీఎం మిషన్ ఇటీవల షార్ట్ సర్క్యూట్‌కు గురై స్వల్పంగా దెబ్బతింది. దాన్ని మరమ్మతులు చేసేందుకు నెల రోజులుగా సంబంధిత బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

బస్టాండ్ ప్రాంగణంలో అటు ప్రయాణికులకు ఇటు ప్రజలకు అందుబాటులో ఉండే ఏటీఎం అదొక్కటే కావడంతో ఆదరణ ఉంది. నెల రోజులుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు, వినియోగదారులు నగదు విత్‌డ్రా కోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే మరమ్మతులు చేసి ఏటీఎంను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

వేసవితాపాన్ని తీర్చే ముంజలు



పాల్వంచరూరల్: ఎండాకాలం వచ్చిందంటే పట్టణ ప్రాంతాల్లో తాటి చెట్టు లేకపోయినా రోడ్ల పక్కన తాటిముంజల విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. సీజనల్‌గా లభించే తాటిముంజలతో ఆరోగ్యపరంగా ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. ఇవి వేసవితాపాన్ని తగ్గించి శరీరానికి చలవ చేస్తాయి. వీటిలో వందశాతం నీరు ఉండడంతో శరీర బరువును తగ్గిస్తాయి. జీర్ణశక్తి కూడా పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగా మార్చి, ఏప్రిల్ నెలలో తాటిముంజలు లభిస్తాయి. ఒక్కసారి ముంజలను రుచి చూసిన వారు మళ్లీ మళ్లీ తినాలనిపించేంతగా ఉంటాయి. పలువురు గౌడ కుల యువకులు కులవృత్తి మీద మమకారంతో ఉపాధి పొందేందుకు ఏజెన్సీలోని అటవీప్రాంతం నుంచి తాటికాయలను తెచ్చి పాల్వంచ మండల, పట్టణ పరిధిలో రోడ్ల పక్కన డజన్ ముంజలు రూ.50 – 75 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిని పలువురు కొనుగోలు చేస్తున్నారు.





పాల్వంచ పట్టణం, మండల కేంద్రంలో తాటిముంజలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం



పాల్వంచరూరల్: రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



టేకులపల్లి మసీదులో ఇఫ్తార్ విందులో ముస్లింలు

పాల్వంచరూరల్: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పాతఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం 20 మజీద్‌లకు చెందిన ముస్లింలకు ప్రభుత్వం నుంచి వచ్చిన 815 రంజాన్ తోఫా, రూ.1.60 లక్షలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద ముస్లింలకు కేసీఆర్ అందించే భరోసానే రంజాన్ తోఫా అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ హిందూ, ముస్లింలు, క్రిస్టియన్ల సంక్షేమం కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో మతతత్వవాదులను ఓడించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే వనమాను ముస్లిం, మైనార్టీ నాయకులు ఫయాజ్, మాదర్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, తహసీల్దార్ రంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడవి సరస్వతి, కిలారు నాగేశ్వరరావు, కనకేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లి మసీదులో ఆదివారం రాత్రి ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తహసీల్దార్ అప్జుత్ పాషా రూ.30వేలు మసీదు కమిటీకి అందజేశారు. విందులో సర్పంచ్ బోడ సరిత, ఎండీ మౌలానా, హనీఫ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలో ఉప కులాలను చేర్చటం అన్యాయం



మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఇల్లెందు: ఎస్టీ జాబితాలో పలు ఉపకులాలను చేర్చాలని సీఎం కేసీఆర్ ప్రకటించటం అన్యాయమని ఎస్టీ సంఘాల జేఏసీ ప్రకటించింది. ఆదివారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసీ సమావేశంలో నంగారా భేరీ వ్యవస్థాపక నాయకుడు దాస్‌రాం నాయక్,, తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడారు. 2016లో 10 తెగలను ఎస్టీ జాబితాలో చేర్చాలని షెడ్యూల్డ్ తెగల విచారణ కమిటీ ఆదేశించగా ఆనాడు చేర్చిన ఉప కులాలు, మాలి తెగను చేర్చటం అన్యాయం అన్నారు. ఇది రాజ్యాంగం సూత్రాలకు విరుద్ధం అన్నారు. ఎదైనా ఒక ఉప కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలంటే ప్రత్యేకమైన కమిషన్‌ను నియమించాలని, డెమోగ్రాఫిక్, ఎతినోగ్రఫిక్ సర్వే నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తర్వాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఎలాంటి సర్వేలు లేకుండా ప్రజాభిప్రాయం లేకుండా ఎస్టీ తెగలలో 11 కులాలను కలపడం రాజ్యాంగానికి వ్యతిరేకం అన్నారు. ఎస్టీ అండ్ డిస్ట్రిక్ట్ కల్చర్ జియోగ్రాఫికల్ ఐసోలేషన్ డిస్టింగ్ లాంగ్వేజ్ సోషల్, ఎడ్యుకేషన్ బ్యాక్వర్డ్స్ లాంటి నివేదిక ఆధారంగా మాత్రమే ఎస్టీ జాబితాలో చేర్చాలని పేర్కొన్నారు. 1/70 చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని, ఏజెన్సీలో వలసలను అరికట్టాలని, జీఓ నంబర్ 3 అనుగుణంగా కొత్త జీఓ తీసుకొచ్చి 100 శాతం రిజర్వేషన్లు, ఉద్యోగాలు ఏజెన్సీలో ఆదివాసీలకు కేటాయించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. రమణాల లక్ష్మయ్య, వట్టం ఉపేందర్, ఈసం నర్సింహారావు, వాసం రామకృష్ణ, రాజేష్ నాయక్, పాయం సత్యనారాయణ, గుంపిడి వెంకటేశ్వర్లు, పూల్ సింగ్, భద్రూ నాయక్ పాల్గొన్నారు.

స్నేక్ ‘హితుడు’.. సంగయ్య

- కబురు వస్తే.. పరుగున చేరుకుంటున్న కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు
- 15 ఏళ్లుగా సుమారు నాలుగువేల పాములు పట్టి అడవిలో వదిలేసిన వైనం
- ప్రాణాలు నిలుపుతూ స్థానికుల మన్ననలు పొందుతున్న సంగయ్య



ఓ ఇంట్లో పామును పట్టుకున్న సంగయ్య

పాల్వంచ: పామును చూస్తేనే భయంతో పరుగు పెడతాం. లేదంటే ధైర్యం చేసి కర్రతో దానిని చంపేందుకు యత్నిస్తుంటారు కొందరు. కానీ పాల్వంచలో ఎవరికైనా పాము కనిపిస్తే మాత్రం సంగయ్యే గుర్తుకొస్తాడు. ఫోన్‌లో సమాచారం ఇస్తే చాలు నిమిషాల్లో వచ్చి పామును పట్టి డబ్బాలో వేసుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తుండటం అతనికి నిత్యకృత్యంగా మారింది. పట్టణంలోని వనమా కాలనీకి చెందిన పావురాల సంగయ్య కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలో ఆర్టిజన్ కార్మికుడిగా (ఫిట్టర్) విధులు నిర్వహిస్తున్నాడు. కానీ ప్రవృత్తి మాత్రం పాములు పట్టడం అలవాటుగా చేసుకుని అందరి మన్ననలను పొందుతున్నాడు.

15 ఏళ్లుగా పాములు పడుతున్న సంగయ్య..

సంగయ్యకు జంతువులంటే ఎంతో ఇష్టం. తొలుత ఇంట్లోనే పలు రకాల జంతువులు, పక్షులు పెంపకంపై ఆసక్తి చూపాడు. కాలక్రమేణ పాములు పట్టాలనే ఆలోచనతో తొలుత తన ఇంట్లోకి వచ్చిన పామునే పట్టి తన భయాన్ని పోగొట్టుకున్నాడు. పాములు పడితే ఎలా చాకచక్యంగా వ్యవహరించాలో, ఒకవేళ కాటు వేస్తే ఏం చేయాలో పలు పుస్తకాలు చదివాడు. అంతేగాక ఇతర వైద్యులు, సిబ్బంది సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. ఇక పాములు పట్టడం చేతికి అందిన విద్యగా మార్చుకున్నాడు. తాను పనిచేసే కేటీపీఎస్ కర్మాగారంలో, కేటీపీఎస్ కాలనీల్లో, కార్మిక వాడల్లో, పట్టణంలో, చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ పాము వచ్చినా వెంటనే వెళ్లి పట్టి దూరంగా అడవిలో వదిలిపెడుతుండడం గమనార్హం.

సుమారు 4వేలకు పైగా పాములు పట్టి అడవిలో వదిలిన వైనం..

పాల్వంచ మండలంతో పాటు చుట్టు పక్కల వారికి పాము కనిపిస్తే సంగయ్య గుర్తుకు వస్తాడు. ఫోన్‌లో సమాచారం ఇస్తే సాధ్యమైనంత త్వరలో వచ్చి పాము పట్టి ఓ డబ్బాలో వేసుకుని దూరంగా అటవీ ప్రదేశాల్లో వదిలేస్తాడు. ఇలా రోజుకు కనీసం ఒకటి రెండు ఫోన్ కాల్స్ వస్తుంటాయి. ఇప్పటి వరకు సుమారు 4వేలకు పైగానే పాములు పట్టేసి ఉంటానని చెబుతున్నాడు.

రోజుకొక ఫోన్ అయినా వస్తుంది

పాములంటే నాకు భయం లేదు. పాము వచ్చింది దానిని పట్టుకోవడానికి రావాలని రోజుకు కనీసం ఒక్క ఫోన్ అయినా వస్తుంటుంది. రోజుకు నాలుగు చోట్లకు వెళ్లి పాములను పట్టిన సందర్భాలు చాలా ఉన్నాయి. పర్యావరణానికి పాము ఎంతో ప్రాముఖ్యమైంది. తనకు ఫోన్ చేసిన వెంటనే వెళ్లకుంటే పామును చంపేస్తారేమో లేక ఎవరినైనా కాటేస్తుందోనని ఆందోళన చెందుతాను. అందుకు వెంటనే వెళ్లేందుకు ప్రయత్నిస్తాను. విధుల్లో ఉన్నప్పుడు కొన్నిసార్లు వెళ్లలేకపోతాను.. ఈ విషయంలో అధికారులు నాకు ప్రత్యేక అవకాశం ఇస్తే బాగుంటుంది. – సంగయ్య, కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు

అటెన్షన్ ప్లీజ్

తీగలు కదిలిస్తేనే కరెంటు వచ్చేది..



సుజాతనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ స్తంభం పైన జంపర్‌లో లూజ్ కనెక్షన్‌తో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. విద్యుత్ పోయిన ప్రతిసారీ ఎవరో ఒకరు వచ్చి తీగలను కర్రతో కొట్టి కదిలిస్తేనే విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీంతో చుట్టుపక్కల పది ఇళ్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఈ ఎండాకాలంలో చిరుగాలులకు కూడా స్తంభంపై మంటలు వస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు. – సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : కిషన్, విద్యుత్ ఏఈ
సెల్ నంబర్ : 7901678192